# నా సాహితీ జీవనంలో జరిగిన కథ

## మల్లాది వెంకట కృష్ణమూర్తి



కేవలం 'కౌముది' పాఠకుల కోసమే మల్లాది గారు మొట్టమొదటి సారిగా వ్రాస్తున్న సంచలనాత్మక శీర్షిక

*1970 నుంచి సాహిత్య మార్గంలో నాకు ఎదురైన అనేక సంఘటనలని, అనుభవాలని పాఠకులతో పంచుకోవడానికి ఈ శీర్షికను ఆరంభిస్తున్నాను. తరచూ నన్ను పాఠకులు అడిగే అనేక ప్రశ్నలకి జవాబులు ఇందులో దొరుకుతాయి. నాకు ఈ మార్గంలో పరిచయం ఉన్న అనేకమంది ప్రముఖుల గురించి రాసే వివిధ విషయాలు, వారితో నా అనుభవాలు చదవడానికి పాఠకులకి ఆసక్తిగా ఉంటాయని విశ్వసిస్తున్నాను. నాకు డైరీ రాసే అలవాటు లేదు కాబట్టి తారీఖులు, నెలలు, సంవత్సరాలు, కొందరి పేర్లు అన్ని సందర్భాల్లోనూ ఇవ్వలేను. అందుకని కేవలం జరిగిన వాటి సారాంశాలని మాత్రమే ఇవ్వగలను. ఎలాంటి దాపరికాలు లేకుండా రాయదలచుకున్నాను కాబట్టి పాఠకులు దీన్ని కల్పితంగా భావించనవసరం లేదు. ఏ విషయం మీదైనా వారు ఇంకాస్త వివరాలు తెలుసుకోడానికి ప్రశ్నలు వేయచ్చు. అలాగే ఏ విషయం మీద తెలుసుకోవాలని ఉందో దాన్ని అడిగితే ఆ వివరాలు రాస్తాను. అయితే ఓ టాపిక్కు ముగిసేదాకా ఆగి దాని మీద నేను చెప్పనివాటి గురించి అడిగితే ఎవరికీ సమయం వృధాకాదు. మీరు టాపిక్కులని సూచించవచ్చు. నేను రాయదలచుకున్న జాబితాలో అవి ఉంటే సరే. లేకపోతే మిగతా పాఠకులకి, నాకు ఈ విషయంలో సహాయం చేసినవారు అవుతారు. అనుమానం ఉన్న సంగతులని వదిలేయదలిచాను కాని అసత్యాలని మాత్రం రాయదలచుకోలేదు. కొందరికి ఇవి బాధని కలిగించవచ్చు. కాని సత్యానికి దగ్గరగా ఉండాలంటే ఇది తప్పదు.* - మల్లాది

If there's a book you really want to read, but it hasn't been written yet, then you must write it.

~Toni Morrison

# కందనాతి చెన్నారెడ్డి

(క్రిందటి సంచికనుంచి కొనసాగింపు)

**ఆ అగ్ని ఆరిపోయేలోగా నేను ఆయన్ని కన్విన్స్ చేయలేనని అనిపించడంతో** ఆయన చెప్పిన దానికి నేను ఒప్పుకున్నాను. ఇది తలచుకుంటే నాకు ఇప్పటికీ ఆశ్చర్యమే. ఆయన ఆ హారతిని ఎందుకు వెలిగించినట్లు? ఈ సాంప్రదాయం గురించి నాకు తెలీదు.

దానికి టైటిల్ *స్రవంతి*ని సూచిస్తే అందుకు అంగీకరించి డిక్లరేషన్ తెప్పించారు. ఏ పత్రికని మొదలు పెట్టాలన్నా దాని పేరుని ఢిల్లీ లోని రిజిస్ట్రార్ ఆఫ్ న్యూస్ పేపర్స్ ఆఫీస్ కార్యాలయానికి దరఖాస్తు పెట్టుకుని ముందుగా అనుమతిని పొందాలి. స్థానిక పోలీసు శాఖ నించి కూడా అందుకు ముందుగానే అనుమతి తీసుకుని దాన్ని ఢిల్లీకి పంపాలి. లంచాలు పెద్దగా ఉండకపోయినా మన మనిషి ఢిల్లీకి వెళ్ళి ప్రయత్నించకపోతే డిక్లరేషన్ (అనుమతి) రావడం చాలా ఆలస్యమవుతుంది.

అప్పటికే *మయూరి, స్వాతి* వార పత్రికలు ఉన్నాయి. కాబట్టి ఆడవారి పేరయితే పత్రికకి బావుంటుందని అనుకుని స్రవంతిని సూచించాను. పైగా ఆ పేరుతో నేనో నవల కూడా రాసాను. మధుప్రియ పబ్లికేషన్స్ సంస్థ యజమాని ప్రసాద్ గారు నా నవలలని ముద్రించినప్పుడు కూడా కొత్త పబ్లిషింగ్ సంస్థని ఆరంభించినప్పుడు దానికి స్రవంతి పబ్లికేషన్స్ అనే పేరు పెట్టి, కేవలం నా పుస్తకాలనే దాని ద్వారా ప్రచురించి తర్వాత దాన్ని మూసేసారు. స్రవంతి నవల నచ్చి రవికిషోర్ అనే నిర్మాత తమ నిర్మాణ సంస్థకి *స్రవంతి మూవీస్* అనే పేరు పెట్టానని నాకు ఓ సందర్భంలో చెప్పారు. చాలామందికి మగ, ఆడ తేడా లేకుండా నచ్చిన నవల స్రవంతి.




నెల రోజుల పాటు *స్రవంతి* వార పత్రిక గురించి కష్టపడ్డాను. అప్పటికే నేను చేసే ప్రభుత్వ ఉద్యోగం మానేసాను. దాంతో 'స్రవంతి' డమ్మీని తయారు చేయసాగాను. వెల రూపాయి కాబట్టి దాన్ని కొని చదివి అవతల పారేసే పత్రికగా, అంటే కాలక్షేపం వారపత్రికగా దాన్ని ఇవ్వాలని నిర్ణయించుకున్నాను. రెండు వారాలకి సరిపడే శీర్షికలని నేను వివిధ పేర్లతో రాసాను.

"రెమ్యునరేషన్ చెన్నారెడ్డి గారితో మాట్లాడండి. నాకు మొదటి సంచిక నించీ సీరియల్ ఇవ్వండి." అని వీరేంద్రనాథ్‌ని సీరియల్ కోరాను. ఆయన 'వెన్నెల్లో గోదారి' అనే ఓ సీరియల్‌ని మొదటి సంచిక నించే ఇచ్చారు.

నా అభిమాన రచయిత కొమ్మూరి సాంబశివరావు గారి ప్రాక్టికల్ జోకర్ నవలని తిరిగి వీక్లీలో సీరియలైజ్ చేసాను. అప్పట్లో వార పత్రికలన్నీ సెంటర్ స్ప్రెడ్‌లని వేసేవి. నేను స్రవంతిలో సెంటర్ స్ప్రెడ్‌గా 'పింక్‌పేజ్' పేరుతో అడల్ట్ మెటీరియల్ శీర్షికలని రూపొందించాను. తొలి రాత్రి-తొలిమాట, కిచీ కిచీ కూ, మొదలైన సెక్స్ బేస్డ్ శీర్షికలే అందులో చాలా ఉన్నాయి. స్రవంతి డబుల్ కలర్‌లో అచ్చయ్యేది. సెంటర్ స్ప్రెడ్ నలుపు, పింక్ రంగుల్లో అచ్చయ్యేది. నాకు స్టాఫ్‌గా ప్రిఫరెన్సులు ఏమీ లేవని చెప్పడంతో ఆ బాధ్యతని కూడా శివప్రసాద్ మీదే పెట్టారు చెన్నారెడ్డి. పవన్ అనే పద్దెనిమిది, పంతొమ్మిదేళ్ళ కుర్రాడు ఆర్టిస్టుగా వచ్చాడు. ఎంతో సిన్సియర్‌గా వర్క్ చేసేవాడు. 'ఇది బావుంటుందేమో చూడండి' అని చాలా లే అవుట్ అయిడియాలు గీసి చూపించేవాడు.

వి.యస్.పి తెన్నేటి అనే అతన్ని శివప్రసాద్ పరిచయం చేసాడు. అతన్ని అసిస్టెంటు ఎడిటర్‌గా తీసుకున్నాను. ఇది రాసేప్పుడే కిరణ్‌ప్రభ గారి ద్వారా తెలిసింది. వి ఎస్ పి తెన్నేటిని శివప్రసాద్ ఇంట్రవ్యూకి పిలిపించి వరసగా రెండు రోజులు నిలబెట్టాడట! తర్వాత నువ్వు ఇంట్రవ్యూలో నెగ్గావు అని సెలక్ట్ చేసాడుట. ఇది శివప్రసాద్ సేడిజానికి ఓ ఉదాహరణ. వి ఎస్ పి అప్పట్లో చాలా ఆర్థిక అవసరాల్లో ఉన్న వ్యక్తి. ఆనంద్ అనే ఆర్టిస్ట్ పల్లకిలో పని చేసేవాడు. అతను స్రవంతికి బొమ్మలు గీసేవాడు. శంకర్ అనే మరో ఆర్టిస్ట్ ఉండేవాడు. సెల్వరాజ్ ఇంకో ఆర్టిస్ట్. అతని సోదరుడు రవికుమార్ పల్లకిలో సబ్ ఎడిటర్‌గా పని చేసేవాడు. నేడు అతను సినిమా రచయిత. రేవతీ నందన్ అనే అతను కూడా పల్లకిలో సబ్ ఎడిటర్‌గా పని చేసేవారు. నాలుగేళ్ళ క్రితం తేజ వీక్లీలో నా సీరియల్ ఎఫ్ ఐ ఆర్ వస్తున్నప్పుడు అతను మళ్ళీ దాని ఎడిటర్‌గా తారసపడ్డారు. అప్పట్లో కంప్యూటర్లు లేవు. పత్రిక పేజీలని తెల్లటి బోర్డు మీద బొమ్మలని, కంపోజ్ ఐన మేటర్‌ని- దీన్ని ఆర్ట్ పుల్ అనేవారు- అతికించి వాటిని ఫొటోలు తీసి ఫిల్మ్ మీదకి ఎక్కించేవారు. ఇప్పుడా పనంతా కంప్యూటర్ లోనే జరిగిపోవడంతో, ఆర్టిస్ట్‌ల పని తగ్గింది. ఏజి ఆఫీసులో పని చేసే సాహిత్యాభిలాష గల చీకోలు సుందరయ్య అనే అతను సాయింత్రాలు వచ్చి పార్ట్ టైమ్‌గా రెండు గంటలు పని చేసేవాడు. కథలని, కార్టూన్లని ప్రాథమిక పరిశీలన చేసేవాడు. అతను ఎంతో సిన్సియర్‌గా వర్క్ చేసేవాడు. కార్టూన్లు, కథలు పరిశీలించాక బాగున్నవాటికి ఇంటిమేషన్‌లు పంపే బాధ్యత అతని మీద పెట్టాను. కవర్లు జత చేసిన బావుండనివి ఇంటికి వెళ్తూ రాజభవన్ రోడ్డు లోని పోస్టాఫీసు పక్కన కారాపి నేనే స్వయంగా పోస్ట్ చేసేవాడిని. పోస్ట్ చేయడానికి పల్లకి, స్రవంతి ఉత్తరాలు ఆఫీసులో ఓ ట్రేలో వేయాలి. ఆఫీసు బాయ్ వాటిని పోస్ట్ చేయాలి. కానీ అవి నిత్యం పోస్ట్‌కి వెళ్ళేవి కావు. ఈ క్రమశిక్షణ శివప్రసాద్‌లో లేకపోవడం వల్ల ఆఫీస్ బాయ్ బద్ధకించేవాడు. అందుకని నేనే అన్నిటినీ స్వయంగా పోస్ట్ చేసేవాడిని.

డమ్మీ వేసే రోజు నేను, తెన్నేటి, పవన్‌లు రాత్రంతా మేలుకుని పనిచేసాం. డమ్మీ అంటే పత్రిక మార్కెట్‌లోకి ఎలా విడుదలవుతుందో అలా డిజైన్ చేయడం. రాజా ఒక్కరే ఆ రాత్రంతా తనకి సంబంధం లేకపోయినా మాతో ఉన్నారు. తెల్లవారుఝామున రెండు తరువాత ఇక ఉండలేక నిద్రపోయారు.

వి ఎస్ పి తెన్నేటి, పవన్, నేను సూర్యోదయం దాకా మేలుకుని పని చేసాం. మర్నాడు ఉదయం పదికే పల్లకి ఆఫీసుకి వెళ్ళాను. చెన్నారెడ్డి గారు ఆశ్చర్యంగా 'రాత్రంతా మేలుకొని వర్క్ చేసారట కదా?' అని అడిగారు. ఆయనకి శివప్రసాద్ మంచి గూఢచారి.

పవన్‌కి సిగరెట్లు తాగే అలవాటుంది. మర్నాడు ఉదయం అతనికో 555 సిగరెట్టు పాకెట్‌ని కొని బహూకరించాను. వి.యస్.పి తెన్నేటికి కూడా ఏదో గిఫ్ట్ కొనిచ్చాను. కానీ గుర్తులేదు.

మొత్తానికి డమ్మీ అచ్చయింది. అందులో చాలా లోపాలు బయటపడ్డాయి. అవన్నీ కరెక్షన్ చేసాకే మొదటి సంచిక వెలువడింది.

"పల్లకికి డమ్మీ వేస్తామంటే దండగ ఖర్చని చెన్నారెడ్డి గారు ఒప్పుకోలేదు. మీకు నో అనలేకపోయారు." శివప్రసాద్ చెప్పాడు.

స్రవంతి వీక్లీ సర్క్యులేషన్ వారం వారం పెరుగుతూ ఆర్నెల్లలో ఎనభై వేలకి చేరుకుంది. భూమి వీక్లీ లక్ష. స్రవంతి రెండో స్థానానికి చేరుకుంది. చెన్నారెడ్డి గారు పెరిగే సర్క్యులేషన్ ఫిగర్లని దాచకుండా చెప్పేవారు. కార్యాలయానికి వచ్చే ఏజెంట్లు నన్ను కలిసి సలహాలు, సూచనలు, అభినందనలు తెలియ చేసేవారు. అయితే ఏడాది పత్రిక నడిచాక, సర్క్యులేషన్ బ్యూరో ఆడిట్ చేసాకే ఏ పత్రికసర్క్యులేషన్ ఫిగర్స్‌కైనా గుర్తింపు లభిస్తుంది. కాబట్టి స్రవంతి సర్క్యులేషన్ ప్రకటనలు తెచ్చేందుకు పెద్దగా పని చెయ్యలేదు.

వీరేంద్రనాథ్ అనంతవరం జనార్దన్ అనే రచయితని ఓ నవలతో పంపి అది పని కొస్తుందేమో చూడమన్నారు. మద్యపానం మీద రాసిన ఆ నవలని సీరియల్‌గా ప్రచురించాను. తెన్నేటి చిన్నపిల్లల నవల రాస్తానంటే కాదనలేదు.

ఓ రోజు ఆంధ్రజ్యోతి దినపత్రిక ఎడిటర్ నండూరి రామోహనరావు గారు 'పత్రికా ఎడిటర్ బాధ్యత మంచిది కాదు. కోర్టు కేసులు కూడా ఎదుర్కోవాల్సి వస్తుంది' అని ఎవరితోనో నాకు కబురు చేసారు. నేను తరువాత వ్యక్తిగతంగా వారిని కలిసినప్పుడు 'మీరాకబురు పంపారా?' అని అడిగితే అవునని జవాబిచ్చారు.

పల్లకి విషయానికి వస్తే అప్పట్లో స్వాతి వార పత్రికలో నేను శనివారం నాది అనే సీరియల్‌ని రాస్తున్నాను. ఆశ్చర్యంగా శివప్రసాద్ అదే కథతో కంఠంనేని రాధాకృష్ణ రాసిన వాల్మీకి అనే సీరియల్‌ని కొద్ది వారాల తర్వాత ఆరంభించాడు. ఇంతదాకా నేను ఎవరి సీరియల్‌ని చదవనేలేదు అని చెప్తే పాఠకులకి ఆశ్చర్యంగా ఉండచ్చు. వాల్మీకి, శనివారం నాది కథాంశం ఒకటే అని నాకు ఎవరో చెప్తే తెలిసింది. ఐనా దాన్ని చదవలేదు. చెన్నారెడ్డి గారు నన్ను ప్రత్యేకంగా ఆ సీరియల్ మీద అభిప్రాయం అడిగారు. అంతదాకా ఆయన అలాంటి సంభాషణ చేసేవారు కారు. బహుశ నేను చెన్నారెడ్డి గారికి దాని మీద ఫిర్యాదు చేస్తానని శివప్రసాద్ అంతకు ముందే ఆయనతో ఏదో మాట్లాడాడని నాకు అర్థమైంది. నేను దాన్ని చదవడం లేదని జవాబు చెప్పాను.




ఓ రోజు రాజా ఫోటో వేయించుకోని రచయిత జీవితం చుట్టూ తను ఓ కథని అల్లానని, నా ఫోటో ఎక్కడా రాలేదు కాబట్టి ఆ రచయిత పేరు, సీరియల్ పేరు మల్లాది వెంకట కృష్ణమూర్తి అని పెట్టాలని అనుకుంటున్నానని, అందుకు నా అనుమతి కావాలని కోరాడు. నేను సరే అన్నాను. చాలామంది మల్లాది వెంకట కృష్ణమూర్తి సీరియల్‌ని చదివి రాజాని అభినందించారు. అందులో అతను చేసిన ఓ కొత్త ప్రయోగం జంధ్యాల, ఎస్ పి బాలసుబ్రమణ్యం, గాయని ఎస్ పి శైలజ ఫన్ డాక్టర్ చంద్రశేఖర్. ఆదివిష్ణు, జీడిగుంట రామచంద్రమూర్తి లాంటి కొందరు నిజ జీవిత వ్యక్తులని పాత్రలుగా వాడుకోవడం. ఓ రచయిత పేరు మీదనవల రావడం అదే ప్రథమం, ఆఖరు కూడా. రాజా పల్లకిలో రాసే సినిమా వార్తలు సెంటర్ స్ప్రెడ్‌లో వచ్చేవి. కొందరు ఏజెంట్లు వాటిని చింపి రూపాయికి అమ్మేవారని కూడా విన్నాను. అది అంత బాగా వచ్చేది.

పల్లకిలో రమేష్ చంద్ర ఛటర్జీ అనే అతను సంఖ్యాశాస్త్రం మీద కాలం రాసేవారు. అతనే రమేష్ చంద్ర మహర్షి పేరుతో నేడు పాపులర్. కుప్పిలి పద్మ అనే అమ్మాయి నాకు వైజాగ్ నించి అనుకుంటా అభిమానిగా ఉత్తరాలు రాసేది. ఉత్తరాలు ఆమె చాలా పొయిటిక్‌గా రాసేది. ఆమె రాసిన ఉత్తరాల్లోని కొన్ని వాక్యాలు నాకు ఎంత బాగా నచ్చాయంటే, నేను మందాకిని నవల్లోని మొదటి పేజీల్లో యథాతథంగా వాడుకున్నాను. ఎందుకంటే నాకు పొడిగా తప్ప, అలా తడిగా రాయడం చేతకాదు. తర్వాత పద్మ హైద్రాబాద్‌కి వచ్చేసారు. మొదటిసారిగా ఓ రోజు మేం పంజగుట్టలోని షాన్‌బాగ్ హోటల్‌లో కలిసాం. ఆమెది చాలా సెన్సిటివ్ నేచర్ అని మాటలని బట్టి గ్రహించాను. అందుకే అంత బాగా ఆ వాక్యాలని రాయగలిగింది. రాశి సిమెంట్స్‌లో నాకు, కుటుంబ సభ్యులకి షేర్లు ఉండేవి. ఆ సంగతి ఆమె ప్రశ్నిస్తే ఆశ్చర్యపోయాను. ఆమె రాశి సిమెంట్స్‌లో సెక్రటేరియల్ విభాగంలో పని చేస్తుండబట్టి ఆ సంగతి తెలిసిందని చెప్పింది. పల్లకి ఆఫీసుకి వచ్చినప్పుడల్లా కలిసేది.

--- --- ---

స్రవంతికి నేను ఎడిటర్‌గా ఆర్నెల్లు పని చేసాక చెన్నారెడ్డి పెద్ద షాక్ ఇచ్చారు. ఓ రోజు ఆఫీసుకి వెళితే పిలిచి చెప్పారు.

"ఇక నించి ఎడిటర్‌గా మీ సర్వీసెస్ అవసరం లేదు. సారీ."

ఆంధ్రజ్యోతి వీక్లీలో పురాణం గారికి రిటైర్‌మెంట్ వయసు వచ్చాక ఎక్స్‌టెన్షన్ ఇవ్వక పోతే ఆయన 'ఆంధ్రజ్యోతి నా మానస పుత్రిక' అని బాధపడ్డారు. నేను మానసికంగా మొదటి నించీ 'స్రవంతి' ఎడిటర్ని అనే అలాంటి బంధాన్ని పెంచుకోలేదు. కాబట్టి ఆయన్ని 'ఎందుకని?' అని కూడా ప్రశ్నించకుండా 'సరే' అని స్టాఫ్‌కి ఆ సంగతి చెప్పి, నాకు వారిచ్చిన సహకారానికి కృతజ్ఞతలని తెలియచేసి బయటకి వచ్చేసాను.

అసలు ఈ జ్ఞాపకాలని రాసి ఉంచి, ఓ ఏభై ఏళ్ళ తర్వాత ప్రచురించే ఏర్పాటు చేయాలని మొదట్లో నా ఆలోచన. ఎందుకంటే జీవించి ఉన్నవారు కొన్ని విషయాలు తమ గురించి రాసినవి చదివి బాధ పడచ్చు. వారికి నా మీద ద్వేషం కలగడం కూడా సహజం. ఇతరులకి నాకు మధ్య జరిగింది యథాతథంగా రాస్తే వారు నొచ్చుకోవచ్చు. అందుకని అలాంటి సందర్భాల్లో వాటిని దాటవేయడం ఒక్కటే దారి. కాని దీన్ని ఏభై ఏళ్ళ తర్వాత చదివే వారికి ఇప్పుడు ఈ

జనరేషన్‌లో ఉన్నవారికి ఉండే ఆసక్తి ఉండదు. ఎందుకంటే దీనికి నేటి పాఠకులంతా సమకాలీనులు. వారే దీన్ని బాగా ఎంజాయ్ చేయగలరని ఈ శీర్షికకి వచ్చే ఉత్తరాలని బట్టి తెలుస్తోంది. కాబట్టి ఇప్పుడు రాయడమే సబబని ఋజువైంది.

ఒక్క వీరేంద్రనాథ్ విషయంలో నాకు అనుమానం లేదు. అతని గురించి ఏం రాసినా నా మీద కోపం తెచ్చుకోరు అనే నమ్మకం ఉంది. అతను చాలా ఎదిగాడు. ఆ నాటి వీరేంద్రనాథ్ కారు. ఇందులో నిజాలు లేకపోతే అతను ఆ విషయం ఇప్పుడు కాని, తర్వాత ఆయన రాసే జ్ఞాపకాల్లో కాని విశదం చేస్తారు. ఎందుకంటే దీన్ని అతను కూడా చదువుతున్నారు. వీటిలో ఎక్కువ భాగం నేను విన్నవే తప్ప కన్నవి కావు కాబట్టి ఇందులో నిజం ఉందని కూడా పాఠకులు భావించనవసరం లేదు.కాని నేను విన్నవి నిజాయితీగా రాయదలిచాను.

అదే రోజు సాయంత్రం శివప్రసాద్ ఫోన్ చేసి చెప్పారు, వీరేంద్రనాథ్ నేను వెళ్ళిన అరగంటకి స్రవంతి ఆఫీసుకి తను ఫోన్ చేయగానే వచ్చారని, 'స్రవంతి' ఆఫీసులోని మొత్తం కాగితాలని తగలబెట్టించారని, అతనే తర్వాతి స్రవంతి ఎడిటర్ అని. నన్ను మరింత బాధపెట్టాలని శివప్రసాద్ యోచన అనిపించింది. కొద్ది రోజుల తర్వాత వివిఎస్‌పి తెన్నేటి మా ఇంటికి వచ్చి చెప్పారు, వీరేంద్రనాథ్ గది కిటికీలకి కర్టెన్లు, ఇతర హుందా అలంకరణలు చేయించారని, కొత్త స్టాఫ్‌తో 'స్రవంతి'ని ఎడిట్ చేస్తున్నారని, తనని తీసేస్తారని భయపడ్డానని, కాని తీసేయలేదని. అతను శివప్రసాద్ ఎంపిక కాని నా ఎంపిక కాదు కదా. చీకోలు సుందరయ్యని తీసేసారు. అతను నా ఎంపిక.

స్రవంతి విజయంతో నన్ను 'పల్లకి'ని కూడా చూడమని శివప్రసాద్‌కి ఉద్వాసన పలుకుతారనే భయం కలిగింది. చెన్నారెడ్డి బలహీనత తెలుసు కాబట్టి 'మల్లాదికి అంత జీతం దేనికండి? వీరేంద్రనాథ్ ఫ్రీగా చూస్తానంటున్నారు' అని చెప్పాడు. నాకు ఇచ్చే జీతాన్ని ఆదా చేసుకోవచ్చనే చెన్నారెడ్డి గారి మనస్థత్వం శివప్రసాద్‌కి బాగా తెలుసు. కొన్నేళ్ళ తర్వాత చెన్నారెడ్డి గారు చెప్పడం వల్ల ఇది తెలిసింది. ఆయన వీరేంద్రనాథ్‌తో మాట్లాడటం, తనకి జీతం, సంపాదకునిగా పేరు అవసరం లేదని వీరేంద్రనాథ్ చెప్పటం జరిగాయి. అప్పటికి ఇంకా అతను ఆంధ్రా బేంక్‌లో పని చేస్తున్నారు కాబట్టి ఎడిటర్‌గా పేరు వేసుకుంటే ఆఫీసులో సమస్యలు వస్తాయి. అందుకని పేరు వద్దని చెప్పి ఉండచ్చు. లేదా నేను మొదలెట్టిన వార పత్రిక కాబట్టి అది అతనికి అభ్యంతరకరంగా తోచి ఉండచ్చు. ఏది ఏమైనా చెన్నారెడ్డి భార్య పేరు ఎడిటర్‌గా స్రవంతిని తెచ్చారు. దాన్ని అతి తక్కువ కాలంలో మూసేసారు. సర్క్యులేషన్ పెంచటం కష్టం కానీ దించడం తేలిక. ఎంతవరకు నిజమో తెలియదు కాని నాతో ఎవరో (పేరు గుర్తు లేదు) అన్నారు, 'మల్లాది స్రవంతిని నామరూపాలు లేకుండా చేస్తాను అని పంతం పట్టి వీరేంద్రనాథ్ దాన్ని మూయించడానికే మిమ్మల్ని తీయించేసారు.' వీరేంద్రనాథ్ అలా అనరని అని నాకు తెలుసు. ఎందుకంటే, వీరేంద్రనాథ్‌కి అలాంటి ఉద్దేశం ఉన్నా నాకు తెలిసి బయటకి ఎవరితో అనే మనిషి కాదు. అతను మాట తూలడం నేను ఎన్నడూ చూడలేదు. నేను ఏ సందర్భంలో ఐతే గట్టిగా బదులు చెప్తానో ఆ సందర్భంలో మౌనంగా ఉండగలిగే కంట్రోల్ అతనికి ఉంది. అంతేకాక ఆ రోజుల్లో మా మధ్య స్పర్ధ ఉందని భావించి ఇలాంటివి నా మీద అతనికి, అతని మీద నాకు అనేకమంది అనేకం చెప్పేవారు.

జరిగిందానికి నాకు చెన్నారెడ్డి గారి మీద కాని వీరేంద్రనాథ్, శివప్రసాద్‌ల మీద కాని పెద్దగా విరోధభావం కలగలేదు. ఓ మానసిక వత్తిడి తగ్గింది అనుకున్నాను. కొన్నేళ్ళకి పల్లకిని కూడా చెన్నారెడ్డి మూసేసారు.

వ్యాపారమంటే ఇచ్చి పుచ్చుకోవడం. నేను సినిమాల్లో, టివి, పత్రికా, పబ్లిషింగ్ రంగాలలో రచయితగా పని చేసాను. ఆ రంగాల్లో నాకు ఎందరో వ్యాపారస్థులతో పరిచయం. పుచ్చుకోవడం తప్ప దానికి సరిపడా ఇవ్వడం చెయ్యని వ్యాపారస్థులే నాకు ఆ రంగాల్లో అధికంగా కనిపించారు. రచయితకి లేదా కళాకారుడికి ఎగ్గొట్టే పారితోషికం తమ లాభంగా భావిస్తారు తప్ప దాన్ని అవసరమైన ఖర్చుగా భావించని వ్యాపారస్థులే మన దేశంలో ఎక్కువ. ఏ వ్యాపారంలో అయితే *పుచ్చుకోవడం తప్ప ఇచ్చుకోవడం ఉండదో* ఆ వ్యాపారం దివాళా తీయడం ఖాయం. నా కళ్ళ ముందు అలాంటి నలభైకి తక్కువ లేకుండా పత్రికలు పుట్టి మరణించాయి – కేవలం పుచ్చుకునే వ్యాపార ధోరణి వల్ల. ఎవరైతే ఇచ్చిపుచ్చుకునే ఆదర్శాన్ని అనుసరిస్తున్నారో వారు ఇంకా కొనసాగుతున్నారు. కోటాను కోట్లు గడించారు. మనందరికీ తెలిసిన ఓ ఉదాహరణ స్వాతి బలరాం. మరో ఉదాహరణ రామోజీరావు. వారి సంస్థల నించి తమ రచనలకి పారితోషికం, కాంప్లిమెంటరీ కాపీ అందని రచయితలు ఖచ్చితంగా ఉండరు.

నాకు బాగా గుర్తు. ఓ రోజు ఆర్టిస్ట్ సెల్వరాజ్ బొమ్మలు గీయటానికి ఇంకు లేదని చెప్పారు. వివరాలడిగితే ఆర్టు పేపర్‌కి, ఇంకుకి తను చెన్నారెడ్డిని రెండు మూడు రోజులకి ఓ సారి కలిసి డబ్బు అడిగి తీసుకుని కొని గీస్తుంటానని, చాలా తక్కువ ఇస్తారని ఈసారి అడిగినా డబ్బు ఇవ్వలేదని చెప్పాడు. నేను వెంటనే చెన్నారెడ్డి గదిలోకి వెళ్ళి నవ్వుతూ అడిగాను.

"మీ ఇంట్లో బియ్యం ఏ రోజుకి ఆ రోజు కొంటూంటారా? లేక నెలకో సారి కొంటారా?"

"ఏం? ఏమైంది?" ఆయన కంగారుగా అడిగారు.

"ఇంటికి బియ్యం ఎలాగో పత్రికాఫీసుకి ఇంకు, డ్రాయింగు పేపర్ అలా." చెప్పి బయటకి వచ్చేసాను.

ఇలా ఆఫీసు పరమైన విషయాల్లో నేనాయనతో గట్టిగా మాట్లాడేవాడిని. మిగిలిన విషయాల్లో మృదువుగా ఉండేవాడిని. ఆయన నన్ను తీసెయ్యడానికి ఇలాంటివి కూడా జోడయ్యాయి.

నన్ను బయటకి పంపాక <u>నైమిష</u> అనే నవల విషయంలో స్రవంతిలో చిన్న సెన్సేషన్ జరిగింది. ఓ షిడ్నీ షెల్డన్ నవలలోని (పేరు గుర్తు లేదు) కొన్ని కాగితాలని, దాన్ని మక్కికి మక్కీ కాపీ కొట్టి తెలుగులో రాసిన నైమిష అనే నవల్లోని పేజీలని పక్కపక్కనే ప్రచురించారు. సూర్యదేవర రామ్మోహన్ రావు ఆ <u>నైమిష</u> రచయిత. సూర్యదేవర ఘోస్ట్ రైటరే వీరేంద్రనాథ్‌కి ఉప్పందించాడని కూడా ఆ రోజుల్లో విన్నాను.

రచయితగా అతన్ని డేమేజ్ చేయడానికి ఇది వీరేంద్రనాథ్ చేసిన పని అని, దీని బేక్‌గ్రౌండ్ ఓ రోజు నాకు సూర్యదేవర రామ్మోహన్ రావు చెప్పారు. తను రచయితని అవాలని అనుకున్నప్పుడు పాపులర్ రచయితలైన నా నవలలు, వీరేంద్రనాథ్ నవలలు ఎలా రాస్తామో తెలుసుకోడానికి చదివానని, ఐతే నా

నవలల్లో ఏదీ ఇంకో దాన్ని పోలి ఉండటం లేదన్న సంగతిని, నాలా రాయడానికి తగిన ఎలిమెంట్ ఏదీ నా నవలల్లో దొరకలేదని, కాని వీరేంద్రనాథ్ నవలల్లో హీరోయిన్ కేరక్టరైజేషన్, మరి కొన్ని అంశాలు ఒకేలా ఉండటం గమనించి అతని పంథాలో రాయదలిచి రాస్తున్నానని, అది మనసులో పెట్టుకుని తన పేరుని స్రవంతి ద్వారా బద్‌నామ్ చేసే ప్రయత్నం చేసాడని. ఇది కూడా సూర్యదేవర ఊహ అయి ఉండాలి. వీరేంద్రనాథ్‌ది అలా ఎవరితోనూ తన మనసులోని మాటని అనే మనస్థత్వం కాదు. *ఓమెన్‌*ని వీరేంద్రనాథ్ *తులసిదళంగా*, *నాట్ ఏ పెన్నీ మోర్ నాట్ ఏ పెన్నీ లెస్* అనే బ్రిటీష్ రచయిత జెఫ్రీ ఆర్చర్ నవల థీమ్‌ని *డబ్బు టు ది పవరాఫ్ డబ్బు*గా మలుచుకుని రాయడం, తర్వాత నైమిష సంఘటన ప్రధానంగా ఇంగ్లీష్ నవలలని తెలుగు రచయితలు కాపీ కొడతారు అనే నమ్మకం పాఠకుల్లో ఏర్పడటానికి బాగా దోహదం చేసాయి. ఐతే *నాట్ ఏ పెన్నీ మోర్ నాట్ ఏ పెన్నీ లెస్* కేవలం ఇన్స్పిరేషన్‌గా తీసుకున్నారు తప్ప, వీరేంద్రనాథ్ రాసిన *డబ్బు టు ది పవర్ ఆఫ్ డబ్బు* నవల్లో ఆయన క్రియేటివిటీ చాలా ఉంది.

కొద్ది వారాలకి చెన్నారెడ్డి మళ్ళీ నాకు ఫోన్ చేసారు.

"ఆఫీసుకి రావడం లేదే? మనం కలుస్తూందాం."

"ఇంకెప్పుడూ ఈ నెంబరుకి ఫోన్ చేయకండి." అని ఫోన్ పెట్టేసాను.

ఆయనలో అవసరమైన ఖర్చులు పెట్టని స్వభావం ఒక్కటే నాకు నచ్చలేదు తప్ప, ఆయన మీద నాకు ద్వేషం, శత్రుత్వం లాంటివి కలగలేదు. నిజానికి ఇతరుల్లో చెడుని తను స్వయంగా చూడకుండా వారి మీద చెప్పింది నమ్మేసే అమాయక స్వభావం ఆయనది. లౌకికుడు కాదు. గడుసుతనం, హాని చేసే మనస్థత్వం కాదాయనది. ఎంతో ప్లెయిన్‌గా ఉండేవారు. అలాంటి వారు సాధారణంగాచుట్టూ చేరే వారి వల్లే చెడిపోతూంటారు. చెన్నారెడ్డి గారి ఇల్లు బంజారా హిల్సులో ఒకనాటి ఆంధ్రజ్యోతి భవంతి పక్క సందులోని జర్నలిస్ట్ కాలనీలో లోపల కుడి వైపు ఉండేది. ఆంధ్రజ్యోతి భవంతి ఎదురుగా హిందూ స్మశాన వాటిక ఉండేది.

"ఎప్పటికైనా వీరేంద్రనాథ్ మా ఇంటి ముందుకు రావాల్సినవాడేగా" అని స్రవంతి, పల్లకిలు మూతపడ్డాక చెన్నారెడ్డి అన్నారని విన్నాను.

ఆ తరువాత ఓ సారి వీరేంద్రనాథ్‌ని 'ఇది నిజమా?' అని అడిగితే బదులుగా ఫక్కున నవ్వారు.

--- ---- ----

నాలుగైదేళ్ళ తర్వాత మళ్ళీ చెన్నారెడ్డి ఫోన్ చేసి పల్లకి విషయంలో కలుద్దాం అన్నారు. ఆయన నిజాం క్లబ్బు మెంబర్. పల్లకీ మొదలయ్యాక అనేక సార్లు ఆయన నన్ను నిజాం క్లబ్బుకి తీసుకు వెళ్ళి ఆతిధ్యం ఇచ్చేవారు. ఆయన చాలా మంచి హోస్ట్. తక్కువ తాగేవారు కాని నన్ను మాత్రం 'మీకు అలవాటేగా. తీసుకోండి' అనేవారు. నాది అయ్యేదాకా ఓపికగా నాతో గడిపేవారు. నిజాం క్లబ్బులో కలుద్దామంటే వెళ్ళాను. మొదటగా తను నన్ను స్రవంతి నించి తీసెయ్యడం మీద క్షమాపణలు చెప్పారు. 'నేను ఘోరమైన పొరపాటు చేసాను. ఐ యాం సారీ' చెప్పారు. శివప్రసాద్ మాటలు నమ్మి మోసపోయానని, పూర్తి స్వేచ్ఛని ఇస్తానని, పల్లకి ఎడిటర్‌గా నన్ను పని చెయ్యమని కోరారు.

"మీరు ఎడిటర్‌గా పని చేసినా చేయకపోయినా సరే, పల్లకిలో వీరేంద్రనాథ్, శివప్రసాద్‌లకి చోటు లేదు. మైనస్ వాళ్ళిద్దరితోనే తీసుకురాదలచుకున్నాను." గట్టిగా చెప్పారు.

"మీరు వీరేంద్రనాథ్ ఎప్పటికైనా మా ఇంటి ముందుకు రావాల్సినవాడు అన్నారా?" నా సందేహం తీర్చుకోడానికి అడిగాను.

"ఆ కోపంలో అన్నానేమో?" చెప్పారు.

అది ద్వేషంతో అన్న మాటలయితే గుర్తుండిపోయేవి. అని ఉంటే, ఆవేశంతో అన్నవి అయి ఉండాలి.

నన్ను ఏ పరిస్థితుల్లో స్రవంతి నించి విరమింప చేసారో ఆయన నాకు ఆ రోజు వివరించారు. వీరేంద్రనాథ్ కర్టెన్స్ కొనిపించిన సంగతి కూడా చెప్తూ, 'మీరు ఉన్నంత కాలం పత్రిక ప్రయోజనం కోసం తప్ప మరి దేనికీ నా చేత ఖర్చు చేయించలేదు అని లేట్‌గా గ్రహించాను. మీ కారుకి పెట్రోల్ కూడా మీరు నన్ను అడగలేదు.' అన్నారు.

నాకు మళ్ళీ ఎడిటర్ అవాలని లేదని, ఆ పదవి మీద వ్యామోహం లేదని చెప్పాను. ఎవరినైనా సూచించమని కోరితే వేదగిరి రాంబాబు పేరుని సూచించాను. అతను భూమి వీక్లీలో సబ్ ఎడిటర్‌గా పని చేసినప్పుడు చెన్నారెడ్డికి పరిచయం కాబట్టి అతనైతే తనకి ఓకే అన్నారు. నేను రాంబాబుకి కబురు పెట్టాను. చెన్నారెడ్డిని రాంబాబు కలిసి జీతం మాట్లాడుకుని పల్లకి ఎడిటర్‌గా చేరాడు. కానీ అతను ఎక్కువకాలం అక్కడ పని చెయ్యలేదు. తామిద్దరి మధ్యా అభిప్రాయం భేదాలు వచ్చి బయటకి వచ్చేసానని రాంబాబు నాకు కర్టెసీగా ఫోన్ చేసి చెప్పారు. చెన్నారెడ్డి గారు 'రాంబాబు తన ఐ.ఏ.యస్ మిత్రులకి పల్లకిని పాంప్లెట్‌గా వాడుకుంటున్నాడని తీసేసాను.' అని చెప్పారు. ఎంతవరకూ నిజమో కానీ చెన్నారెడ్డి గారు పల్లకి కోసం కోసం బేంకుల నించి తీసుకున్న అప్పుల విషయంలో పల్లకిని పునఃప్రారంభించారని, అది తాత్కాలికంగానే మూత పడిందని చెప్పి పునరుద్దరించానని చెప్పుకున్నారు. ఇలాంటి పుకార్లు సృష్టించడం తేలిక. నాకు సంబంధం లేని విషయాల మీద మొదటి నించీ నాకు ఆసక్తి లేదు. కాబట్టి ఆయన్ని అడగలేదు. ఏడాది కూడా రాకుండానే మళ్ళీ పల్లకి ఆగిపోయింది.

మైనస్ శివప్రసాద్, వీరేంద్రనాథ్‌లతోనే రెండోసారి పల్లకి వచ్చింది. నా సీరియల్ అడిగారు కాని నేను అప్పటికే రెండు వార పత్రికల్లో రాస్తున్నాను కాబట్టి రాయలేదు. అప్పట్లో వారానికి రెండు వార పత్రికలకే సీరియల్స్ రాసే వాడిని. నా సీరియల్ ఓ పత్రికలో అయిపోయేసరికి రెండో సారి వచ్చిన పల్లకి కూడా ఆగిపోయింది.

పత్రిక కొనసాగడానికి వ్యాపారస్థుడికి చిత్తశుద్ధి కావాలి. కానీ చెన్నారెడ్డి గారు పత్రికా వ్యాపారానికి దూరమవడానికి అనేక కారణాలు ఉన్నాయి. పత్రికలని ఎక్కువ కాలం కొనసాగించే దార్శనికత లేక కొంత, ఖర్చులని బిగపట్టడం వల్ల కొంత, సాహిత్యం మీద అవగాహన కాని, అభిరుచి కాని పెద్దగా లేక, పత్రికని కేవలం వ్యాపార వస్తువుగా చూడటం వల్ల కొంత, చెడ్డ వాళ్ళు ఆయనకి దగ్గరవడంతో ఆయన వాటిని మూసెయ్యక తప్పలేదు. ఆయనలో వేమూరి

బలరాంలో గల చిత్తశుద్ధి ఉంటే పల్లకిని స్వాతి వీక్లీ అధిగమించేది కాదు. స్వాతికి ఆ రోజుల్లో లేని ఎన్నో ప్రయోజనాలని పల్లకి అనుభవించింది. నేను పల్లకికి తప్ప చెన్నారెడ్డి గారు పెట్టిన ఇంకే పత్రికలకి రాయలేదు. కారణం రెడ్డిగారు అడగలేదు. స్రవంతిలో కూడా ఎడిటోరియల్ మినహా ఇంకేమీ రాయలేదు. అచ్చు తప్పులతో ఆ పత్రిక వెలువడేది. దాని మీద హాస్యంగా ఎడిటోరియల్‌ని రాసేవాడ్ని. అదీ పాఠకులు వినోదంగా భావించి చదివేవారు.

అదే సమయంలో చెన్నారెడ్డి గారి అమ్మాయి మెడిసన్ పూర్తయింది. ఆమె కోసం ఆయన పంజగుట్ట ప్రాంతంలో ఓ హాస్పిటల్‌ని కట్టించారు. పల్లకిని మూసేసాక ఆయన దాని వ్యవహారాలు చూసుకోసాగారు. ఆ తర్వాత మళ్ళీ ఎన్నడూ మా దారులు కలవలేదు.

శివప్రసాద్ ఏమైపొయ్యాడో ఎవరికీ తెలీదు. కిరణ్‌ప్రభ గారు అతని కోసం గాలించి మొత్తానికి అతని వివరాలు తెలుసుకున్నారు. అతను హైద్రాబాద్ వచ్చినప్పుడు ఓ మనిషిని పంపితే ఆ నాటి మనుషుల్ని ఎవర్నీ కలవడానికి అతను ఇష్టపడలేదని అతని ఇంట్లోని వారు చెప్పారని, అతను బాంబేలో ఉంటున్నాడని ఆ మధ్య నాకు చెప్పారు. **(వచ్చే నెల మరి కొన్ని విశేషాలు)**



ఆగస్ట్ 1986లో చెన్నారెడ్డి గారు ఒక్క రూపాయి ధరతో ఓ వార పత్రికని వెలువరిద్దామనుకుంటున్నాననీ, నన్ను ఎడిటర్‌గా వుండమనీ కోరారు. వప్పుకోవాలా వద్దా అని అనేక రకాలుగా ఆలోచించి చివరికి ఓ ఆరు నెలల పాటు ఎడిటర్‌గా వుంటాను, తర్వాత కంటిన్యూ అయినా, అవకపోయినా మరేమీ అనుకోకూడదు అన్నాను. ఆయన అందుకు అంగీకరించారు.

ఈ 28వ సంచిక నుంచి నేను ఎడిటర్‌ని కాను.

ఇంతకాలం తమ రచనలని పంపిన రచయితలకి, కార్టూనిస్ట్‌లకి, ఏజెంట్స్‌కి, స్రవంతి సిబ్బందికి, చెన్నారెడ్డి గారికి, ముఖ్యంగా మీకందరికీ నా కృతజ్ఞతలు తెలియచేస్తూ మీ నుంచి ఎడిటర్‌గా శెలవు తీసుకుంటున్నాను.

మీ,

15/4/1987.

## పర్సనల్ లెటర్స్

ఆర్టీసి చైర్మన్ గారికి,
బస్సు చార్జీలు పెంచితే పెంచారు కాస్త పిక్ అవర్స్‌లో (సిటీ రూట్లలో) జరక్కుండా తగు చర్యలు తీసుకోండి.
-యం.వి. కోటేశ్వరరావు, నాగార్జునసాగర్.

డియర్ శోభకన్యా, సిరిపూర్.
మీ కొత్త కాపురం ఎలా సాగుతోంది?
-ఎస్. రాధాకృష్ణ, కాగజ్‌నగర్.

హలో భవాని,
నీ బాడీగార్డ్‌కి "దెయ్యం" అని పేరుపెట్టి భలేగా దెబ్బతీశావ్.
-ఎ. సాహెరాఖాను, ధర్మవరం.

డియర్ ఫ్రెండ్, ఏలూరు.
మా అన్నయ్య మనిపర్సు పోయింది. పర్సు ఇవ్వకపోయినా మా వదిన ఫోటో అయినా ఇవ్వండి ప్లీజ్.
-ఆర్. కుమారి, బుట్టాయిగూడెం.

మనసైన కళా, గుంటూరు.
ఇంకా నా ప్రేమ గొప్పదనం తెలీలేదా? నీ కోసం నిరీక్షిస్తూ. -ఎ. అనూరాధ, గుంటూరు.

హలో శ్రీదేవి, కర్నూలు.
ఇటీవలే ఇల్లుమారాం. ఉత్తరాలు ఆఫీసు అడ్రసుకే రాయి. -వి. రామమోహనరావు హైదరాబాదు.

మైడియర్ కె. లక్ష్మీకుమారి,
నీ చిరునవ్వు దూరమైతే నా బ్రతుకు విషాదమే! -బి. శ్రీనివాసరావు, తెనాలి.

ఒరేయ్ ఆంటీ, గోపాలరావుపేట.
బ్రతికున్నావా? ఉంటే వెంటనే ఉత్తరం రాయి. -ఎస్. శేషగిరి, జగిత్యాల.

సుమధురహాసినీ సుహాసినీ, కర్నూలు.
అమృతం పంచిన ఆ మధురక్షణాల్ని మరచిపోలేక.... -డి. రవి, చిత్తూరు.

డియర్ దేవి, పెద్దపల్లి.
నీకు తెలికనే ఎన్నో సంఘటనలు జరుగుతున్నాయ్! -యస్. పద్మనాభ్, నిర్మల్.

ప్రియమైన శోభారాణి, వెంపల్లి.
పందొమ్మిదో వసంతం పూర్తి చేసుకున్నావ్ మరి మన పెళ్ళెప్పుడంటావ్?
-జి.ఎస్. రాజశేఖర్‌రెడ్డి, అనంతపురం.

డియర్ శీను, ప్రభు, హైదరాబాదు.
మన మధు ఇంతవరకూ నాకు కనిపించలేదు.
-బి. రెడ్డిశేఖర్, అనంతపురం.

మైడియర్ జానకి, వైజాగ్.
నా మీద కోపం ఇంకా తగ్గలేదా?
-కె.జి. శంకర్, రెల్లిగొరమ్మపేట.

మిస్ నాగమ్మా, భీమవరం.
నీ జీవితభాగస్వామి అయ్యేవరాన్ని నాకు ప్రసాదించవూ?
-కె. నరసింహారావు, హైదరాబాదు.

స్రవంతి వినూత్న వారపత్రిక 30-4-1987 3




Click here to share your comments on this article